## క్లుప్తంగా

### వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాల భోగం నిర్వహించారు. అనంతరం తోమాల సేవ జరిగింది. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వదర్శనాలు కొనసాగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వేంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

### నేడు మరిడిమాంబ పండగ


మరిడిమాంబ

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో వెలసిన మరిడిమాంబ వార్షిక పండగను ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం నుంచి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులు అగ్ని గుండాలు తొక్కేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం గొరపల్లి నుంచి అమ్మవారి ఆలయం వరకు ఘటాల ఊరేగింపు, అనుపోత్సవం జరుగుతుందని వెల్లడించారు.

### పరవాడ ఎంపీడీవోగా రమేష్‌నాయుడు


బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్‌నాయుడు

పరవాడ: పరవాడ ఎంపీడీవోగా బి.రమేష్‌నాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన శ్యామ్ సుందర్ గత కొన్ని నెలల క్రితం విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వల్ల సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో కొయ్యూరు ఎంపీడీవోగా పని చేసిన రమేష్‌నాయుడును నియమించారు.

### ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ప్రారంభం


ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు

అల్లిపురం: పూర్ణామార్కెట్ వద్ద ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌ను పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బంది 24 గంటలు పూర్ణామార్కెట్ ప్రాంతంలో విధులు నిర్వహించేందుకు అనుకూలంగా ట్రాఫిక్ వలంటీర్ ఆలివ్ సతీష్ సహకారంతో ట్రాఫిక్ సబ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన పూర్ణామార్కెట్‌లో పర్యటించారు. అక్కడి వ్యాపారులు, వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన జీవీఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాల ద్వారా ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్స్ పార్కింగ్ చేసుకునే విధంగా మార్కింగ్ చేయించి, బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ కె. ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్, ట్రాఫిక్ సీఐలు షణ్ముఖరావు, శ్రీనివాసరావు, వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ జీడీ బాబు, ట్రాఫిక్ ఎస్సైలు విశ్వనాథం, లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పెంచిన పాల రేట్లు తగ్గించాలి

దాబాగార్డెన్స్: విశాఖ డెయిరీ యాజమాన్యం ఏకపక్షంగా పాల ధర లీటరుకు రూ.2 పెంచేసిందని, ఈ నెల 10 నుంచి పెంచిన రేట్లు అమల్లోకి తీసుకొచ్చారని, ఈ పెంపును సీపీఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని భారీగా పెంచిన పాల రేట్లను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏడాది కిందటే లీటర్ పాల ధర రూ.2 పెంచేసిందని, ఈ పెంపుదలను టీడీపీ, జనసేన, బీజేపీలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడవక ముందే మరో రూ.2 లీటర్‌కి పెంచడం దుర్మార్గమన్నారు. పైపెచ్చు రైతులకు లీటర్ పాల సేకరణ ధరను రూ.3కి తగ్గించారని, ప్రస్తుతం రైతుల నుంచి సేకరించే లీటరు పాల సేకరణ ధరకు, వినియోగదారులకు విశాఖ డెయిరీ అమ్మే ధరకు రూ.20 వ్యత్యాసం ఉందన్నారు. కానీ వినియోగదారులకు మాత్రం గత ఏడాది కాలంలో లీటర్ పాల ధర రెండు సార్లు రూ.2 చొప్పున రూ.4 పెంచడమంటే ప్రజలపై తీవ్ర భారం మోపడమేనన్నారు. ఈ పెంపుదల వల్ల ప్రజలపై రూ.6 కోట్ల భారం పడతుందని, ఇప్పటికే ఆస్తి పన్నులో మార్పు చేసి ప్రతి ఏడాది 15 శాతం చొప్పున ఆస్తి పన్ను పెంచుతున్నారని, నిత్యావసర సరుకులన్నీ ఆకాశాన్ని అంటుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, పెంచిన రేట్లను తగ్గించాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు.

# నిర్మాణాలకు బ్రేక్


ప్రారంభించకముందే ధ్వంసమైన కిటికీ అద్దాలు


అసంపూర్తిగా నిలిచిపోయిన వాడచీపురుపల్లి సచివాలయ భవనం-2

**అసంపూర్తిగా భవనాలు**

**నిధులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం**

పరవాడ : మండలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పలు ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరును నిలిపివేసింది. దీంతో భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. వాడచీపురుపల్లిలో రూ.40 లక్షలతో ప్రారంభమైన గ్రామ సచివాలయ భవన నిర్మాణం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆగిపోయింది. ఇదే పరిస్థితి మండలంలోని పెదముషిడివాడ, రావాడ గ్రామాల్లోని సచివాలయ భవనాలది కూడా. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వాడచీపురుపల్లిలో రూ.21 లక్షలతో చేపట్టిన రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) భవనం నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ప్రారంభానికి ముందే అద్దాలు ధ్వంసం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే తరహాలో పెదముషిడివాడ, కన్నూరు, రావాడ, పరవాడ, భర్నికం, కలపాక, గొర్లివానిపాలెం గ్రామాల్లోని ఆర్బీకే భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. దీనివల్ల రైతులు తమ పనుల కోసం మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంపై ఆధారపడాల్సి వస్తోంది. అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.


ప్రారంభానికి నోచుకోని రైతు భరోసా కేంద్ర భవనం

#### నిధుల కొరత బాధాకరం



వాడచీపురుపల్లి గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన గ్రామ సచివాలయ భవనం -2 నిర్మాణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. నిధుల కొరత కారణంగా గత ఏడాదిగా పనులు నిలిచిపోవడంతో సచివాలయ సిబ్బంది అద్దె భవనంలో పనిచేస్తున్నారు. రైతు భరోసా కేంద్రం భవనం నిర్మాణం పూర్తయినా అధికారులు ప్రారంభోత్సవం చేపట్టకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాన్ని పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

-కూండ్రపు సోమునాయుడు

#### నిర్మాణాలను పూర్తి చేయాలి



పెదముషిడివాడ గ్రామంలో లక్షల రూపాయలతో చేపట్టిన గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) భవనాల నిర్మాణాలు ఏడాది కాలంగా అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ భవనాలకు ఇంకా ప్లాస్టింగ్, కిటికీలు, తలుపులు, పెయింటింగ్, విద్యుత్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో స్థానిక రైతులు, ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ఈ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

-కలవలపల్లి సత్యనారాయణ, పెదముషిడివాడ

### వైఎస్సార్‌సీపీ నేత మాధవరావుకు పరామర్శ


మాధవరావును పరామర్శిస్తున్న అదీప్‌రాజ్

పెందుర్తి: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ 95వ వార్డు అధ్యక్షుడు రాపర్తి మాధవరావును మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. శనివారం నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో ఆయనను కలిసి ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి మాధవరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మనాలత జోబ్‌దాస్ (చిన్ని), నాయకులు పీతల విష్ణుమూర్తి, దాసరి సత్తిబాబు, వేపాడశ్రీను పాల్గొన్నారు.

### పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్‌లో భాస్కరరావుకు పతకాలు



పెదగంట్యాడ: కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలో ఇటీవల నిర్వహించిన పాన్ ఇండియా మాస్టర్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి భాస్కరరావు పతకాల పంట పండించారు. పవర్ లిఫ్టింగ్‌లో నాలుగు బంగారు పతకాలు, వెయిట్ లిఫ్టింగ్‌లో మూడు రజత పతకాలు సాధించారు. అలాగే అక్టోబర్‌లో బెంగళూరులో నిర్వహించనున్న ఆసియా పోటీలకు భాస్కరరావు అర్హత సాధించారు.

## ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావం


ఆపరేషన్ సిందూర్‌కి సంఘీభావం తెలియజేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సబ్బవరం:దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో అధ్యాపకులు, విద్యార్థులు ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న భారత సైన్యానికి సంఘీభావం ప్రకటించారు. వర్సిటీ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు యూనివర్సిటీ అకడమిక్ బ్లాక్ ముఖద్వారం వద్ద జాతీయ జెండాలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ శనివారం ప్రదర్శనలో పాల్గొన్నారు. విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఇన్నాళ్లు సహనం పాటించిన మన సైన్యం సాహసాన్ని ప్రదర్శించడానికి సిద్ధమైన సమయంలో జాతి మొత్తం సంఘటితంగా భారత సైన్యం, ప్రభుత్వం వెనుక మేము ఉన్నామని అండగా నిలబడాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి విభేదాలు, తారతమ్యాలు, అభిప్రాయభేదాలు లేకుండా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు

### దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనాలు, రైతులకు గిట్టు బాటు ధర వంటి డిమాండ్లతో ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను కార్మికవర్గం జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఫార్మాసిటీలో శనివారం ఏర్పాటు చేసిన కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్‌కోడ్స్ వల్ల సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, పని గంటలు పెంచడం, పారిశ్రామిక వివాదాల చట్టానికి తూట్లు పొడవడం వంటి అనేక దుర్మార్గమైన విధానాలు పొందుపరిచారన్నారు. వాటిని ఎట్టి పరిస్థితిలో ఆమోదించకుండా తిప్పికొట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.రమణ, జి.చిట్టిబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ పరిధిలోని అజనగిరి గ్రామంలో ఇటీవల జరిగిన కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన టీమ్‌లకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేతుల మీదుగా శనివారం రాత్రి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో 88వ వార్డు అధ్యక్షుడు గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు నారపిన్ని అప్పలరాజు, చట్టి అప్పారావు, దాడి నూకరాజు, గొల్లలపాలెం సర్పంచ్ మోపాడ అప్పారావు, పార్టీ నాయకులు బోరయ్య, మాటూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన ధ్యానోత్సవాలు


నృత్యం చేస్తున్న కళాకారులు


పాల్గొన్న ఉత్తరాంధ్ర ధ్యాన గురువులు

పెందుర్తి: స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్, ఉత్తరాంధ్ర ధ్యాన మాస్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో తలపెట్టిన బుద్ధ పౌర్ణమి ధ్యానోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ధ్యాన మాస్టర్లు మాట్లాడుతూ నిరంతర ధ్యాన ప్రక్రియ వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ధ్యానాన్ని నిత్య జీవనంలో భాగం చేసుకోవాలని సూచించారు. మనిషి మంచి నడవడిక కోసం గౌతమ బుద్ధుని అడుగుజాడల్లో నడవాలని సూచించారు. తొలిరోజు సంగీత ధ్యానంతో ప్రారంభమైంది. అనంతరం సీతమ్మధారకు చెందిన కృష్ణవేణి ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీతం, రమణి బృందం ఆధ్వర్యంలో రమణీయ రాగాలు, నోరి గాయత్రి ఆధ్వర్యంలో వీణా నాద ధ్యానం, మిట్టా మనోహర్ ఆధ్వర్యంలో ఆచార్య సాంగత్యం, కృష్ణవేణి బృందం ఆధ్వర్యంలో నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల నుంచి ధ్యాన మాస్టర్లు, ధ్యానులు పాల్గొన్నారు.

### ఉపాధి కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

దాబాగార్డెన్స్: ఉపాధి అవకాశాలు గల పలు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్వస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అలైడ్ సైన్సెస్ ప్రతినిధి డాక్టర్ హరిత పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆల్టర్‌నేటివ్ థెరపీస్, కాస్మెటాలజీ కోర్సుల్లో అపారమైన అనుభవం ఉన్న స్వస్థ ఇనిస్టిట్యూట్ విద్యార్థులకు సువర్ణ అవకాశం కల్పిస్తోందన్నారు. ఏడాది కోర్స్‌లో శిక్షణతో పాటు ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ ఇంటర్న్‌షిప్ కూడా కల్పించనున్నట్టు చెప్పారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఏడాది పాటు ఈ కోర్సులో శిక్షణ అందివ్వనున్నట్టు తెలిపారు. సెంచూరియన్ యూనివర్సిటీతో అనుబంధం కలిగి పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా కోర్సులు అందిస్తుందన్నారు. అలాగే కాస్మెటాలజీ, హెల్త్‌కేర్ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమాలో డైట్ అండ్ న్యూట్రిషన్ కోర్సులు ప్రారంభించినట్టు హరిత చెప్పారు.

## అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

## గ్రామాల్లో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ ప్రారంభం


అవగాహన సదస్సులో పాల్గొన్న ఆదర్శ్ విద్యార్థులు, సర్పంచ్ చంద్రవాణి


పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌ను శనివారం ప్రారంభించారు. చినముషిడివాడలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రాజెక్ట్, మంగళపాలెంలో వ్యవసాయం, జుత్తాడలో పాడిపరిశ్రమ, తవ్వవానిపాలెంలో వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్, కె.కోటపాడులో పాడిపరిశ్రమ ఉత్పత్తుల అమ్మకం, కొత్తవలసలో స్వయం ఉపాధి అవకాశాలు, తుమ్మికాపల్లిలో తల్లిబిడ్డ సంరక్షణ, కొత్తవలసలో ఆరోగ్యం, శుభ్రత అనే అంశాలపై ఆదర్శ్ కళాశాలకు చెందిన విద్యార్థులు పరిశోధనలు చేస్తారని కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ తెలిపారు. ఆయా రంగాల్లో లాభనష్టాలు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇస్తారన్నారు. ప్రిన్సిపాల్ ఎన్.ఈ ఫ్లోరా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రాజెక్ట్ జూన్ 20తో ముగుస్తుందని పేర్కొన్నారు.

## హక్కుల రక్షణకే సమ్మె


సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి


ఉక్కునగరం: కార్మికుల హక్కుల రక్షణ కోసం ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లో శనివారం నిర్వహించిన సీఐటీయూ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలో రూ. 1594 కోట్లు రావాల్సి ఉందన్నారు. వీటిని మూడు విడతలుగా చెల్లిస్తారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు గత నెల రూ. 72 కోట్లు లాభం వచ్చిందన్నారు. గతంలో ప్లాంట్ ఆర్థిక పరిస్థితి బాగుంటే కార్మికులకు పూర్తి జీతాలు చెల్లిస్తామని చెప్పిన యాజమాన్యం నేడు చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. లేబర్ కోడ్స్ అమల్లోకి రాకముందే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో స్టీల్ యాజమాన్యం వాటిని ఇక్కడ అమలు చేస్తుందన్నారు. యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ పూర్తి రామెటీరియల్ సమకూర్చిన తర్వాతే బీఎఫ్-3 ప్రారంభిస్తానని స్టీల్ కార్యదర్శి చెప్పారన్నారు. జూన్ నెలాఖరు వరకు రా మెటీరియల్ అందుబాటులో ఉండదని చెబుతున్న యాజమాన్యం జూన్ 10నే బీఎఫ్-3 ప్రారంభించడమేంటని ప్రశ్నించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకే సమ్మెలో పాల్గొంటున్నట్టు వెల్లడించారు. సమావేశంలో నాయకులు పి. శ్రీనివాసరాజు, బి. అప్పారావు, టి.వి. రాజు, మరిడయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి మృతి


సత్యనారాయణ (ఫైల్)

తగరపువలస: ఆనందపురం వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి ప్రమాదవశాత్తు ఫ్లైఓవర్‌పై నుంచి పడి మృతి చెందాడు. విశాఖ సత్యం జంక్షన్ క్రాంతి నగర్‌కు చెందిన నిద్దాన సత్యనారాయణ అనే వ్యక్తి మతిస్థిమితం లేకపోవడంతో శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. గతంలో కూడా ఇలా వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవాడు, కానీ ఈసారి రాలేదు. అయితే శనివారం తెల్లవారుజామున ఆనందపురం దగ్గర వేములవలస పాత ఫ్లైఓవర్‌పై నుంచి సత్యనారాయణ పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారి సమాచారంతో కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడు. కాగా ఇతని వద్దనున్న ఆధార్ ద్వారా చిరునామా తెలుసుకుని పోలీసులు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రెడ్డిపల్లిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లిలో మామిడి తోటలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు పద్మనాభం పోలీసులు శనివారం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... రెడ్డిపల్లి గ్రామంలోని బోని బంగారయ్య మామిడి తోటలో శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి వీఆర్‌ఏ బోని చంద్రరావుకు సమాచారం ఇచ్చారు. వీఆర్‌ఏ ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుంది. అతడు సుమారు 5.5 అడుగుల ఎత్తు కలిగి, గులాబి రంగు గీతలతో కూడిన నల్ల రంగు హాఫ్ హ్యాండ్స్ షర్టు, తెలుపు చుక్కలు గల నేవీ బ్లూ రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. మృతదేహం కాలిపోయి ఉంది. మృతదేహాన్ని భీమిలీ మార్చురీలో ఉంచారు. ఈ వ్యక్తి గురించి తెలిసిన వారు 94906 17920, 08933 223558 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## పౌర్ణమి పూజలకు వేళాయె

**రేపు సత్యదేవుని ఆలయంలో వేడుకలు**


ఇసుకకొండపై వెలసిన స్వామి ఆలయం

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 12న వైశాఖి పూర్ణిమను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. లోక కల్యాణం, విశ్వశాంతిని కాంక్షిస్తూ వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు, సామూహిక, విశేష వ్రతాలు జరపనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశామని, క్యూలైన్లలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వాహనాలపై వచ్చే భక్తులు కేజీహెచ్ వైపు నుంచి వచ్చే వాహన మార్గం మూసి వేయడం దృష్ట్యా భక్తులు పూర్ణామార్కెట్‌కు ఎదురుగా ఉన్న ఘాట్‌రోడ్ నుంచి మాత్రమే ఆలయానికి రావాలని ఈవో పేర్కొన్నారు.

**పూజలు ఇలా..**

తెల్లవారు జాము 2.30 గంటలకు స్వామి ఆరాధన కార్యక్రమం అనంతరం 4 గంటలకు ధ్వజస్తంభ పూజలు జరపనున్నారు. అనంతరం 4.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నారు. ఉదయం 4 గంటలకు నిర్వహించే ధ్వజస్తంభ పూజకు రూ.1,116 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఉదయం 7, తిరిగి 10.30 గంటలకు నిర్వహించే ప్రత్యేక వ్రతంలో పాల్గొనదలిచే దంపతులు రూ.1,116 చెల్లించి పూజలో పాల్గొనవచ్చు. అలాగే ఉదయం 8.30 గంటలకు నిర్వహించే సామూహిక వ్రతంలో పాల్గొనదలిచే భక్తులు రూ.516 చెల్లించి పూజలో పాల్గొనవచ్చు.


రమా సహిత సత్యనారాయణ స్వామి